

4

7, 36 డివిజన్‌లలో పర్యటించిన మేయర్ కొలగాని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజలకోసం

కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

శనివారం | 28 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 13



# డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాల నివారణ సాధ్యం

డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించిన రామగుండం పోలీస్ కమిషనరేట్

12



# పేదలకు మెరుగైన వైద్యమే తన లక్ష్యం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి కేంద్ర నిధులే ఊపిరి

సిఎస్ఆర్‌తో ఆధునిక పరికరాల ప్రారంభం

12



# సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ నిదర్శనం

లయన్స్ క్లబ్‌లో ‘లయన్ బొమ్మ వెంకటేశ్వర్’ బ్లాక్ ప్రారంభం

మంత్రి పొన్నం ప్రభాకర్

13

# మద్దికుంటలో ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ



**ముస్తాబాద్, ఫిబ్రవరి 27( ప్రజాజ్యోతి) :**

మద్దికుంట గ్రామంలో ఈరోజు బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు కదిరే తిరుపతి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. అలాగే మద్దికుంట గ్రామ సర్పంచ్ దొంకుల రాజమళ్ళవ్వ, ఉపసర్పంచ్ జింక మల్లేశం, మాజీ ఎంపీపీ శరత్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హన్మంత్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, కరికే దాసు, తాండ్ర రాంగోపాల్, అనిల్, వేణు మరియు బీజేపీ కుటుంబ శ్రేణులు పాల్గొన్నారు. ప్రముఖులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం మరియు సంక్షేమం కోసం ఉజ్వల యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ వినియోగం పెరగడం వల్ల పొగరహిత వంటగదులు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు.లబ్ధిదారులు ప్రభుత్వానికి మరియు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వార్డు సభ్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా ఆకుల శ్రీదేవి



**కొడిమ్యాల, ఫిబ్రవరి 27,(ప్రజాజ్యోతి):**



తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షురాలిగా ఆకుల శ్రీదేవి, ఉపాధ్యక్షుడిగా పబ్బ మహేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. పూడూరు గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలు అంద జేశారు. కార్యక్రమం లో సర్పంచ్ కడారి మల్లేశం,ఉపసర్పంచ్ సంతోష్, వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# గుంతలు పుడిపించిన నాయకులు



**గొల్లపెల్లి , ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

జగిత్యాల ధర్మారం ప్రధాన రహదారిపై గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మరియు అంబేద్కర్ సర్కిల్ వద్ద అలాగే వెలుగుమట్ల రోడ్డు వద్ద మిషన్ భగీరథ కాంట్రాక్టర్ గత కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డును తవ్వి వదిలేసాడు అట్టి రోడ్డు పై గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతుండటం తో గమనించిన ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు వెంటనే స్పందించి ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్ ద్వారా తెలపడంతో శుక్రవారం రోజున గుంతలను ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేపించారు ఈ సందర్భంగా వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తూ సమస్యను గుర్తించి పరిష్కారానికి కృషిచేసిన ప్రజా ప్రతినిధులకు స్థానిక నాయకులకు వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆర్ అండ్ బి సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ మోహన్‌కి ఘన సన్మానం

**మెట్‌పల్లి, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**




మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ పదవీ విరమణ సందర్భంగా వెంకట్ రెడ్డి గార్డెన్‌లో శుక్రవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి విశేషంగా సేవలందించిన కమిషనర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రశంసించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (ఎల్.బి) బి. రాజా గౌడ్ హాజరయ్యారు. అలాగే డి.ఎస్.పి రాములు, పీడీ డీఆర్‌డీఏ రఘువరన్, సీఐ అనిల్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నరసింగరావు, మున్సిపల్ చైర్మన్ లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ తొ పాటు అన్ని వార్డుల కౌన్సిలర్లు, జగిత్యాల, కోరుట్ల, రాయికల్, ధర్మపురి, చొప్పదండి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ టి. మోహన్ దంపతులను జువ్వాడి నరసింగరావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ, మెట్‌పల్లి




పట్టణంలో కమిషనర్‌గా టి. మోహన్ అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేసి పట్టణానికి మేలుచేసారని కొనియాడారు. ఆయన చేసిన సేవలను పట్టణ ప్రజలు ఎన్నటికీ మరవలేరని పేర్కొన్నారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని, అయితే నిబద్ధత గల అధికారి పదవీ విరమణ పొందడం కొంత బాధాకర మని తెలిపారు. డి.ఎస్.పి రాములు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో కమిషనర్ సమర్థంగా పనిచేసి, ఎలాంటి అంతరాయాలు లేకుండా ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యేలా కృషి చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పట్టణ ప్రజలు, పాత్రికేయులు పాల్గొని కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసిన కౌన్సిలర్లు

**చొప్పదండి ,ఫిబ్రవరి 27 ( ప్రజా జ్యోతి):**



చొప్పదండి మున్సిపాలిటీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి కౌన్సిలర్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కరీంనగర్ లో మంత్రి నివాసంలో కలుసుకొని మున్సిపాలిటీ ప్రధాన సమస్యలపై చర్చించారు. చొప్పదండి పట్టణ బిజెపి అధ్యక్షుడు, 3వ వార్డు కౌన్సిలర్ చిల్ల అర్చన శ్రవణ్ కుమార్, 8వ వార్డ్ కౌన్సిలర్ రాజన్నల రాజు, 13వ వార్డు కౌన్సిలర్ జిట్ట మంగ కుమార్ అభివృద్ధి అవసరాలు, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై మంత్రికి వివరించారు. చొప్పదండి ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని కోరగా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.పట్టణ ప్రజల సంక్షేమమే లక్ష్యమని, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని కౌన్సిలర్ లు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలకు బంగారు “భవిత”

**చొప్పదండి, ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):**

చొప్పదండి జెడ్పిహెచ్ఎస్ పరిధిలోని “భవిత” కేంద్రం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బంగారు భవితను అందిస్తోంది. ప్రత్యేక పిల్లలకు సమాన అవకాశాలు లభించేందుకు ఒక ఆశాజ్యోతి లా పనిచేస్తున్నది. సమాజ ప్రగతిని కొలిచేది ఎత్తైన భవనాలు కాదు. అతి బలహీనుల పట్ల చూపే బాధ్యతే అసలైన అభివృద్ధి. ఈ సూత్రానికి నిలువెత్తు నిదర్శనంగా చొప్పదండి జడ్పిహెచ్ఎస్ లో కొనసాగుతున్న భవిత సెంటర్ నిలుస్తుంది. సాధారణ విద్యా వ్యవస్థలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఎన్నో అవరోధాలు ఎదుర్కొంటున్నారు. మాట్లాడడంలో లోపాలు, నేర్చుకునే సామర్థ్యంలో తేడాలు, శారీరక పరిమితులు ఇవన్నీ వారి ప్రతిభను కుంచించే అంశాలుగా మారుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో భవిత సెంటర్ వారి జీవితాల్లో ఆశా దీపంలా మారింది. చొప్పదండి మండలంలో మెంత్తం 64 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉండగా, భవిత సెంటర్లో 21 మంది పిల్లలు రెగ్యులర్గా హాజరవుతున్నారు. భవిత కేంద్రంలో




ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు (ఐ ఈ ఆర్ పి) పి. శ్రీనివాస్, డి. పద్మలు పిల్లల సామర్థ్యాలను గుర్తించి వారి అవసరాలకు అనుగుణంగా బోధన అందిస్తున్నారని జడ్పీహెచ్ఎస్ (బాలురు) ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి తెలిపారు. మాట అభివృద్ధి ,కదలికల మెరుగుదల, మానసిక ధైర్యం పెంపొందించే కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నాటుతున్నాయి. ఫిజియోథెరపీ, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, స్టైఫండ్, రవాణా సౌకర్యం తదితర కార్యక్రమాలు కూడా పిల్లల తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. సాధారణ తరగతులతో సమన్వయంగా సాగుతున్న ఈ శిక్షణ వల్ల వారు సమాజంలో వెనుకబడిన వర్గంగా కాకుండా సమాన హక్కులున్న పౌరులుగా ఎదుగుతున్నారు. భవిత సెంటర్ మరో విశిష్టత తల్లిదండ్రులలో కలిగిస్తున్న నమ్మకం. గతంలో తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళనతో ఉన్న కుటుంబాలు, ఇప్పుడు ఆశతో పాఠశాల వైపు నడుస్తున్నాయి. పిల్లలలో మార్పు కళ్ళముందే కనిపిస్తుండటమే ఇందుకు కారణం. అయితే ఇంత మంచి ప్రయత్నం ఇక్కడితో ఆగిపోకూడదు. భవిత సెంటర్లకు మరింత మౌలిక సదుపాయాలు ఆధునిక పరికరాలు, నిపుణులైన సిబ్బంది అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. భవిత కేంద్రాలు బలోపేతం కావాలంటే ప్రభుత్వం విద్యాశాఖ సమాజం సమిష్టిగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక అవసరాల పిల్లలపై ఖర్చు చేయడం వ్యయం కాదని, అది రేపటి సమాజంపై పెట్టుబడి అని, ఆ పెట్టుబడికి చొప్పదండి జడ్పిహెచ్ఎస్ భవిత సెంటర్ ఒక ఉదాహరణగా నిలుస్తున్నదని పలువురు వ్యాఖ్యానించారు.

# ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలు

## విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 27( ప్రజాజ్యోతి) :**

సుల్తానాబాద్ మండలంలో యువ సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచాలని కోరారు. గత విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి కేంద్రీకరించి విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇతర విషయాలపై ఆలోచనలు పక్కన పెట్టి, చదువుపైనే శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దాతల సహకారంతో ప్రతి సంవత్సరం పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుమ్మ నిశాంత్, పతంజలి యోగ గురువు ఎల్ల మల్లేశం, దేవసాని సన్నీ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మద్దుల గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

## ప్రత్యేక పూజలు చేసిన మండల సర్పంచ్ లు,అభిమానులు



**ఎండపల్లి, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**


కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ సింగిల్ విండో ఛైర్మెన్ స్థానిక నాయకులు,మద్ధుల గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి,ఎండపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సంఘ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామాల సర్పంచ్ లు మద్దుల గోపాల్ రెడ్డి, పేరుతో కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆ స్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఆయనపై ఉండాలని రాబోయే రోజుల్లో మరింత ప్రజా సేవ చేసే అదృష్టాన్ని, అవకాశాన్ని వారికి కలిగించాలని కోరుతూ ఆ స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు,ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజారాంపల్లి గ్రామ సర్పంచ్ సంగ రమేష్,గొడిసెలపేట గ్రామ సర్పంచ్ కందికట్ల అమృత రాజేష్, చర్లపల్లి సర్పంచ్ పడిదం లావణ్య మొగిలి, గుల్లకోట సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, కొత్తపేట సర్పంచ్ జీరెడ్డీ మహేందర్ రెడ్డి, పడకల్ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్, అంబారిపేట సర్పంచ్ దర్శనాల నరేష్ సూరారం సర్పంచ్ కోడిపెల్లి కొమురమ్మ శ్రీనివాస్, మారేడుపల్లి సర్పంచ్ బాలసాని శారద మల్లేశం,ఉండేడ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి శానబండ సర్పంచ్ భాస్కర్ ముంజంపల్లి సర్పంచ్ సింగిరెడ్డి లింగారెడ్డి నాయకులు , పాల్గొన్నారు.అలాగే మండల వ్యాప్తంగా నేనున్నా అంటూ అన్ని వర్గాల ప్రజలకు సహాయం చేస్తు విద్యార్థులకు యువతకు అభిమాన నేత రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి కి ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి బాణాసంచ పేల్చి తమ అభిమాన నాయకుని జన్మదినంలో తమ ప్రియతమ నాయకుని పై ఉన్న ప్రేమ అభిమానాన్ని ఫ్లెక్సీలు కట్టి బాణా సంచాలు పేల్చి కేకులు కట్ చేసుకుని ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేసి తమ నాయకుని పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు

## గర్భిణీ మహిళలకు, చిన్నారులకు

# సేవలు అందిస్తున్న అంగన్వాడి కేంద్రాలు

**చొప్పదండి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):**

చొప్పదండి మండలంలో మొత్తం 46 అంగన్వాడి కేంద్రాలు పనిచేస్తూ గ్రామీణ,పట్టణ ప్రాంత ప్రజలకు కీలక సేవలు అందిస్తున్నాయి. ముఖ్యంగా గర్భిణీ మహిళలు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యకు ఈ కేంద్రాలు పునాదిగా నిలుస్తున్నాయి. చొప్పదండి మండలాన్ని చొప్పదండి, ఆర్నకొండ రెండు సెక్టార్లుగా విభజించి పర్యవేక్షిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు సంతోషి, మస్రత్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు, టీకాలపై అవగాహన, పిల్లలకు పౌష్టిక భోజనం, ప్రీ ప్రైమరీ విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యే ప్రధాన కేంద్రాలుగా ఇవి పనిచేస్తున్నాయి. చిన్నారుల్లో కుపోసనను నివారించడం, అక్షరాభ్యాసానికి అలవాటు చేయడం, తల్లుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడం అంగన్వాడి కేంద్రాల ప్రధాన లక్ష్యాలు. ప్రతిరోజు పిల్లలకు గుడ్డు, పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నారు. అంగన్వాడీ టీచర్లు ,ఆయాలు తక్కువ వేతనాలతోనే అయినా సమాజసేవనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఇంటింటి సర్వేలు, గర్భిణీల నమోదు, టీకాల పర్యవేక్షణ వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. కాగా కొన్ని కేంద్రాల్లో సొంత భవనాల లేమి, తాగునీరు ,మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాల కొరత సమస్యగా మారింది . వేతనాల ఆలస్యం, పని భారం అధికంగా ఉండటం వల్ల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తే గ్రామీణ ప్రాంతాల్లో తల్లి, బిడ్డల ఆరోగ్యం మరింత పెరుగుపడే అవకాశం ఉంది. సొంత భవనాలు, ఆధునిక వసతులు, సిబ్బందికి తగిన గౌరవ వేతనాలు అందిస్తే ఈ వ్యవస్థ మరింత ప్రభావవంతంగా మారనుంది. గ్రామీణ సమాజానికి వెన్నెముకలా నిలుస్తున్న అంగన్వాడి కేంద్రాలు నిజంగా ప్రజా ఆరోగ్యానికి తొలిమెట్టు అని చెప్పవచ్చు.




# కోర్టు తీర్పు బిజెపి నాయకులు చెంపపెట్టు

## తెలంగాణ జాగృతి జిల్లా ఉపాధ్యక్షుడు వరద సతీష్



**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27( ప్రజాజ్యోతి) :**

మండల కేంద్రంలో తెలంగాణ జాగృతి సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ నాయకుల కుట్ర కుతంత్రాలతో కల్వకుంట్ల కవితపై అక్రమంగా లిక్కర్ కేసును అంటగట్టి జైల్లో వేసిన అమీషా ,నరేంద్ర మోడీల తీరు కోర్టు తీర్పు చంప పెట్టు లా గా తీర్పులిచ్చిందని అన్నారు. ఇకనైనా ప్రాంతీయ పార్టీలపై బురద చల్లడం అక్రమ కేసులు పెట్టడం తన జేబులో పర్స్ లాగా సిబిఐ ని ఇష్టం ఉన్నట్టు వాడుకోవడం ప్రజాస్వామ్యానికి కలంకామని ని తొందర్లోనే ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్తారని ప్రజల బిజెపి మీద నమ్మకం పోయిందని బిజెపి అక్రమాలకు అందినంత దండుకోవడం తప్పుడు కేసులు పెట్టడం, మతోన్వాదాన్ని రెచ్చగొట్టడం తప్ప అభివృద్ధిలో చేసింది ఏమీ లేదు శూన్యం అని ప్రతిప్రంగా విమర్శించారు .ఇకనైనా ఇలాంటిచర్యలు మానుకోండి అన్నారు .విలేకర్ల సమావేశంలో వినయ్, కదిరి భాస్కర్, పొందుర్తి ఉమేష్, అశోక్ మల్లేష్ పాల్గొన్నారు .

# డ్రైవర్లకు నేత్ర పరీక్షలు



**సుల్తానాబాద్ , ఫిబ్రవరి 27( ప్రజాజ్యోతి) :**

రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన 'అరైవ్ అలైవ్' ప్రచారంలో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రి నగర్‌లో లారీ డ్రైవర్లకు నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు డ్రైవర్ల కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే డ్రైవర్లు కంటి చూపును నిరంతరం పరీక్షించించుకోవాలని తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రకుమార్ అశోక్ రెడ్డి లారీ అసోసియేషన్ అధ్యక్షులు కంకణాల తిరుపతి లైన్స్ క్లబ్ అధ్యక్షులు జూపల్లి తిరుమలరావు ఎర్రవెల్లి సు-ధీర్ రావు గుర్రాల శ్రీనివాస్ కలవేని సతీష్ పోలీస్ సిబ్బందితోపాటు లారీ డ్రైవర్లు ఓనర్లు పలువురు పాల్గొన్నారు .

# ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

**కొడిమ్యాల, ఫిబ్రవరి 27,(ప్రజాజ్యోతి):**

మండలంలోని నల్లగొండ రైతువేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, నానో ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ మాళవిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ట్రైకోడెర్మా, పీఎస్‌బీ వంటి జీవన ఎరువులు వాడాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ చంద్ర దీపక్ నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై వివరించారు. ఉప సర్పంచ్ జి.శ్రీనివాస్, ఏఈఓ శ్రీలత పాల్గొన్నారు.



## పోలీసులచే ఉచిత కంటి వైద్య శిబిరం

### రోడ్డు భద్రతా నియమాల తప్పక పాటిద్దాం

### ఎస్పీ మహేష్ బి గీతే



**ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం రోజున పోలీసు వారిచే ఉచిత వైద్య కంటి వైద్య శిబిరాన్ని అశ్విని హాస్పిటల్ వారు డాక్టర్ సత్యనారాయణ స్వామి వారి సౌజన్యంచే నిర్వహించారు. పలువురు ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ సూపర్డెంట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాలను నివారించడానికి ఏకైక మార్గం ట్రాఫిక్ నియమాలను పాటించడమే అని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు మద్యం సేవించి డ్రైవింగ్, ఓవర్ స్పీడు, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం పట్టుబడితే పడితే ఎంతటి వారినైనా కేసులు తప్పవని హెచ్చరించారు. సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి సీఐ శ్రీనివాస్ ఎస్ఐ పోలీసులు పాల్గొన్నారు.



# కుర్చీ పెట్టిన పంచాయతీ

### గ్రామ పంచాయతీలో ప్రథమ పౌరునికి దక్కని గౌరవం!
### ప్రజాసమస్యలు పక్కకు..
### ప్రారంభంలోనే ఉపసర్పంచ్ కుర్చీలాట!
### కుర్చీ తెచ్చిన బేధాభిప్రాయాలు
### వేడెక్కిన తకళ్ళపెల్లి గ్రామసభ
### ఎంపిడిఓకు ఫిర్యాదు



**కథలాపూర్, ఫిబ్రవరి 27(ప్రజాజ్యోతి):**

తకళ్ళపెల్లి గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం మధ్య విబేధాలు తలెత్తాయి. ఆ గ్రామాభివృద్ధి, తాగునీరు, రహదారులు, మురికి కాలువల సమస్యలు అన్నీ పక్కనపెట్టి ఈసారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రధాన చర్చగా మారింది "కుర్చీ" వ్యవహారం. మండల పరిధిలోని తకళ్ళపెల్లిలో సర్పంచ్, ఉపసర్పంచ్ మధ్య ఎవరు ఏ కుర్చీలో కూర్చోవాలి అన్న అంశం ఇప్పుడు మండల వ్యాప్తంగా పెద్ద పంచాయతీగా మారింది. గత కొద్ది రోజులుగా ముసుగులో దాగిన కుర్చీ వివాదం శుక్రవారం బహిర్గతమైంది. ఇటీవల నూతనంగా ఎన్నికైన తకళ్ళపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భూపెల్లి రాజగంగారం, ఉపసర్పంచ్ కాసాడి గంగాధర్ మధ్య గత కొన్ని రోజులుగా కుర్చీ వ్యవహారం ఇప్పుడు బహిరంగ చర్చకు దారితీసి వివాదానికి తెరలేపింది. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యమాయంలో పలు అభివృద్ధి అంశాలతో పాటు త్వరలో జరుగబోయే వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం ఏర్పాట్లుపై నిర్వహించిన పంచాయతీ సాధారణ సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమావేశం ప్రారంభానికి ముందే కూర్చోవాల్సిన స్థానాలపై ఇరువురి మధ్య అంతర్గత భేధాభిప్రాయాలు బహిరంగంగా వ్యక్తమయ్యాయి. సమావేశం ప్రారంభానికి ముందు సర్పంచ్ ఉపసర్పంచ్ కార్యాలయానికి చేరుకోగా సర్పంచ్ తన పదవికి అనుగుణంగా ప్రధాన సీటు తనకే చెందుతుందని పేర్కొనగా, ఉపసర్పంచ్ కూడా తనకు సముచిత స్థానం కల్పించాలని పరోక్షంగా డిమాండ్ చేస్తూ సిబ్బందితో ప్రధాన సీటు ప్రక్కనే సమానంగా సీటు వేయించుకొని కూర్చోవడంతో సమావేశం సమరానికి దారి తీస్తుందా! అనేట్లు కనిపించింది ఫోటోలోని చిత్రం. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌కు చాంబర్ ఉంటుంది. ఉప సర్పంచ్‌కు ఉండదు. సామరస్యంగా ఉంటే ఏమీ కాదు. కాని అభ్యంతరాలుంటే సర్పంచ్‌కే చాంబర్ ఏర్పాటు ఉంటుంది. కానీ పైన కనిపిస్తున్న ఫోటోలో ఇరువురిలో సర్పంచ్ ఎవరు? ఉపసర్పంచ్ ఎవరు!?. కుర్చీ ఎడమవైపా? కుడివైపా? మధ్యలోనా? అనే చర్చ కంటి చూపులుతో కొంతసేపు అభివృద్ధి అంశాల కంటే తీవ్ర స్థాయిలో వేడెక్కింది. ఇదే విషయంపై శుక్రవారం గ్రామసభ అనంతరం సర్పంచ్ భూపెల్లి రాజగంగారం స్థానిక ఎంపిడిఓకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వివాదం ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది. స్థానిక ప్రజలు మాట్లాడుతూ, ప్రజల అభివృద్ధి కోసం ఎన్నికైన ప్రతినిధులు వ్యక్తిగత అభిమానం అంశాల కంటే గ్రామాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు తలెత్తకుండా అధికారులు పంచాయతీ స్థాయిలో స్పష్టమైన విధానం రూపొందించాలని కోరారు. చూడాలి మరి కుర్చీ పెట్టిన పంచాయతీ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో!.

## కరీంనగర్ నగరపాలక సంస్థ పరిదిలోని

# 7, 36 డివిజన్‌లలో పర్యటించిన మేయర్ కొలగాని





**కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 27( ప్రజాజ్యోతి) :**

డివిజన్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చి.... పారిశుధ్య పనులను మరింత మెరుగు పరచాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులు, కార్మికులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య నిర్వాహణలో భాగంగా శుక్రవారం ఉదయం 7,36 డివిజన్ లలో పర్యటించారు. మొదటగా 36 వ డివిజన్ లో కార్పొరేటర్ తోట అనిల్ తో కలిసి మారుతి నగర్ జెండా చౌరస్తా వద్ద పారిశుధ్య కార్మికుల హాజరు రికార్డును తనిఖీ చేశారు. పారిశుధ్య అధికారులు, కార్మికులను పారిశుధ్య పనులు చేపడుతున్న తీరు వాటి వవరాలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనుల నిర్వహణపై కార్మికులకు పలు సూచనలు చేసి....కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీస్కరావాలని కార్మికులకు సూచించారు. అనంతరం 7 వ డివిజన్ హౌజింగ్ బోర్డులో కార్పోరేటర్ ఆకుల నందిని ఉదయ్ తో కలిసి పాదయాత్ర ద్వారా పారిశుధ్య పనులను తనిఖీ చేసి పరిశీలించారు. పలు కాలనీల్లో పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేస్తున్న కార్మికులతో మాట్లాడి... సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హౌజింగ్ బోర్డులో స్థానికంగా రెండు పార్కులను సందర్శించి... పరిశీలించారు. పార్కులో వాకర్ల సమస్యలు అడిగి తెలుసుకొని...వాకర్లు దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ...నగర పారిశుద్యాన్ని మరింత మెరుగు పరిచేందుకు కార్మికులు, అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. కార్మికులు, సిబ్బంది ప్రతి రోజు విధులకు తప్పక హాజరై... పరిసరాలను పరిశుభ్రం చేయాలన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు జవానులు, ఎస్సైలు స్పందించి... వెను వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీస్కోవాలన్నారు. కార్మికులకు అవసరాలను బట్టి కావల్సిన పనిముట్లు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ల వారిగా స్వచ్ఛ్ ఆటో వాహనాలు ప్రతి ఇంటి నుండి చెత్తను వేరు వేరుగా సేకరించేలా జవానులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం పారిశుధ్య పనులు కొనసాగే సమయంలో జవానులు, ఎస్సైల, ససూపర్ వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. స్వచ్ఛ్ ఆటోలు, ట్రాక్టర్ వాహనాల ద్వారా చెత్తను ఎప్పటికప్పుడు డీఆర్ సీసీలు, డంపు యార్డుకు తరలించాలన్నారు. సెక్రిగేషన్ ప్రక్రియ ను తప్పక పాటించి... డంపు యార్డుకు వెల్లే చెత్తను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి స్వచ్ఛ్ ఆటోలో తడి, పొడి చెత్తకు సంబంధించి పార్టేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎక్కడ జీవిపి ( గార్బేజ్) పాయింట్ల వద్ద చెత్త కనబడకుండ చూడాలని... గార్బేజ్ పాయింట్ల వద్ద చెత్త పడకుండ జవానులు బాధ్యత వహించాలని ఆదేశించారు. డివిజన్ల లో కార్మికులను సర్దుబాటు చేస్తూ... పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్లలో పార్కులను కూడ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని.... పార్కులలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించాలని అన్నారు. వాకర్లు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కుల నిర్వహణ చేపట్టాలన్నారు. డివిజన్ లలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఓపెన్ డ్రైనేజీలు ఉన్న చోట చెత్త, సిల్టును తొలగించి... మురుగు నీరు నిలువకుండ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా రెండు లేక మూడు డ్రైనేజీలు ఒకే చోట కలిసే జంక్షన్ వద్ద, కల్వర్టుల వద్ద చెత్త పేరుకు పోకుండ చూడాలని... చెత్త, సిల్టును ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. డివిజన్ లలో పారిశుధ్యం మెరుగ్గా ఉంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని... ఆదిశగా పారిశుధ్య అధికారులు, సిబ్బంది, కార్మికులు పారిశుధ్య పనులు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు కూడ తమ ఆరోగ్యం పట్ల కూడ శ్రద్ద వహించాలని... పనులు చేసే సమయంలో నగరపాలక సంస్థ ద్వారా అందించిన ఆప్రాన్ లు, చేతులకు గ్లౌజులు, బూట్లు తప్పక వేస్కోవాలని అన్నారు. తెల్లవారు జామున రోడ్లను శుభ్రపరిచే సమయం కార్మికులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పారిశుధ్య పనుల పై సూపర్ వైజర్లు, ఎస్సై, జవానులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి... సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించేలా పారిశుధ్య కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు తోట అనిల్, ఆకుల నందిని ఉదయ్, ఎంహెచ్ఓ సుమన్, సానిటేషన్ సూపర్ వైజర్ శ్యామ్ రాజ్, ఎస్సై శ్రీధర్, జవానులు పాల్గొన్నారు. మాజీ కార్పోరేటర్ ఆకుల పద్మప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి బకాయిల వసూళ్లు పూర్తి చేయాలి

## మార్చి 5లోపు 100 శాతం రికవరీ సాధించాలి: డీఆర్‌డీఓ ఎం.కాళిందిని





**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):**

జిల్లాలో స్త్రీనిధి రుణాల బకాయిల వసూళ్లను తక్షణమే పూర్తి చేసి శాతం వంద రికవరీ సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ (డీఆర్‌డీఓ) ఎం.కాళిందిని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో స్త్రీనిధి రుణాల ప్రగతి తక్కువగా ఉన్న వీఓఏలు, క్లస్టర్ సమన్వయకర్తలు, స్త్రీనిధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రూ.2 లక్షలకు పైగా బకాయిలు ఉన్న 116 వీఓఏల పనితీరును ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. గత సమావేశంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని వీఓఏల వారీగా ప్రశ్నించిన డీఆర్‌డీఓ, మార్చి 5, 2026లోపు పూర్తి స్థాయిలో బకాయిల వసూళ్లు చేపట్టి రుణ ప్రణాళికను 100 శాతం అమలు చేయాలని స్పష్టం చేశారు. ఆదేశాలను పాటించని పక్షంలో ప్రభుత్వ ఉత్తర్వు నం.58 ప్రకారం వేతనాలు నిలిపివేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్త్రీనిధి రుణాల తిరిగి చెల్లింపుల మొత్తాలను దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్లస్టర్ కోఆర్డినేటర్లు, స్త్రీనిధి మేనేజర్లు, సహాయ మేనేజర్లు రికవరీ ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు.

సకాలంలో రికవరీ పూర్తి చేస్తే సభ్యులకు తక్కువ వడ్డీతో (సుమారు 11 శాతం) రుణాలు అందుబాటులో ఉంటాయని, తద్వారా అధిక వడ్డీ వసూలు చేసే ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. గ్రామ సంఘాల్లో ప్రతి నెల డీసీబీ నివేదికలు సమర్పించి గడువు తేదీలకు ముందే వసూళ్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేలా సమిష్టిగా పనిచేయాలని డీఆర్‌డీఓ పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీఓ రవీందర్, ప్రాంతీయ మేనేజర్ ఆర్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సైనికుడికి గన్- విద్యార్థికి పెన్



**కోనరావుపేట:, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

కొనరావుపేట మండలం కనగర్తి, సుద్దాలలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ శ్రీనివాసులు సంఘం ఆధ్వర్యంలో పెన్నులు పంపిణీ చేశారు. శ్రీనివాసులు సేవా సంస్థ ప్రతినిధి అవధూత శ్రీనివాస్ సందర్భంగా మాట్లాడుతూ చిలుకూరి బాలాజీ శివాలయ ప్రధాన అర్చకులు సురేష్, ఆత్మారాం సంకల్పం, తెలంగాణ శ్రీనివాసులు సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ఆధ్వర్యంలో మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్ష రాస్తున్న సుమారు రెండు లక్షల 50 వేల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరస్వతీ కటాక్షం పేరుతో పెన్నులు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పెన్నులు ప్రధానం చేయడం జరిగిందన్నారు. బాసర జ్ఞానసరస్వతి ఆలయంలో పూజలు నిర్వహించిన ఈ పెన్నులతో విద్యార్థులు పదో పల్సరీ అతదిన మారులు సాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎం నరెడ్ల సునీత శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలి

**కాల్వ శ్రీరాంపూర్, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రధానోపాధ్యా యురాలుగా విధులు .నిర్వహించి పదవి విరమణ పొందిన. నరెడ్ల సునీత ను శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు విద్య బోధన చేసిన తీరును. కొనియాడుతూ శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సుల్తానాబాద్ మండల విద్యాధికారి .ఆరేపల్లి రాజయ్య పెద్దపల్లి మండల విద్యాధికారి .సురేందర్. ప్రధానోపాధ్యాయులు. వేణుగోపాల చారి .రఘురాం. విక్రమ్ .శ్రీధర్ .స్వరూప. వెంకటేష్ .శ్యాంసుందర్. మాధవి. పిఆర్టియు మండల అధ్యక్షుడు . పంజాల. హరికృష్ణ. ఉపాధ్యాయ బృందం. తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం మేయర్ కు ఘనంగా సన్మానం



**రామగుండం, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ మహంకాళి స్వామి . మర్యాదపూర్వకంగా బిల్ కలెక్టర్ గసిగంటి సుధాకర్. ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. బిల్ కలెక్టర్ ను ఉద్దేశించి మున్సిపల్ అభివృద్ధికి రెవిన్యూ పెంపుకు సహకరించాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా కృషి చేయాలని మొదలగు వాటిని సూచించినారు ఇందులో పాల్గొన్న వారు శిలుముల ఐలయ్య, సురేందర్, చీదురు వసంతరావు, కాంపల్లి శంకర్. రమేష్ .రవీంద్రనాథ్. కలే కూర రవి .శ్రవణ్ కుమార్. పెండ్యాల ఉదయ్ కుమార్ .రోడ్డ శంకర్ డి శ్రీనివాస్ .మెట్టు శ్రీనివాస్. ఎ మహేష్ .సునీల్. విజయ్ పాల్గొన్నారు.

## ఇంటి పన్ను వసూళ్లలో 100% లక్ష్యం సాధన



**జమ్మికుంట, ఫిబ్రవరి27( ప్రజాజ్యోతి ):**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 28వ వార్డులో ఇంటి పన్ను వసూళ్లలో 100 శాతం లక్ష్యాన్ని సాధించిన వార్డు ఆఫీసర్ కోడం రాజును మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అభినందించారు. పూర్తి స్థాయిలో పన్ను వసూళ్లు జరిపి మున్సిపాలిటీకి ఆదర్శంగా నిలిచినందుకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణీ పాల్గొన్నారు.

## సీఎం కప్ విజేతలకు మెడల్స్ అందజేసిన సంజయ్ కుమార్



**బుగ్గారం, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు.బుగ్గారం మండల కేంద్రం లోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌కు చెందిన జోగినిపెల్లి విశ్వక్, పరుమల అజయ్‌లు కిక్ బాక్సింగ్ పోటీల్లో అండర్-13 సంవత్సరాల పాయింట్ ఫైట్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసి సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి మెడల్స్ అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా క్రీడాధికారి, కిక్ బాక్సింగ్ కోచ్ గణేష్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

## ప్రశాంతంగా ఇంటర్ ఇంగ్లీష్ పరీక్ష

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):**

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్1 పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించబడింది. మొత్తం 5,228 మంది విద్యార్థులకు గాను 5,101 మంది హాజరుకాగా 127 మంది గైర్హాజరైనట్లు జిల్లా పరీక్షల కమిటీ తెలిపింది. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పర్యవేక్షణ చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని వెల్లడించారు. శనివారం జరగనున్న ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## కొండపాకలో గట్టు మధు గౌడ్ కుటుంబానికి పరామర్శ

**వీణవంక, ఫిబ్రవరి 27 ( ప్రజాజ్యోతి )**



వీణవంక మండలం కొండపాక గ్రామానికి చెందిన గట్టు మధు గౌడ్ సతీమణి వసంత ఇటీవల మరణించగా, శుక్రవారం వారి కుటుంబ సభ్యులను గెల్లు శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు.బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడైన గెల్లు శ్రీనివాస్ యాదవ్ బాధిత కుటుంబాన్ని కలిసి వసంత మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.వసంత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఇ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వాలీబాల్ జెర్సీలకు స్పాన్సర్‌షిప్

### సాయి సింధు చిల్డ్రన్ ఉమెన్ హాస్పిటల్‌కు కృతజ్ఞతలు



**ధర్మారం, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

కరీంనగర్‌కు చెందిన సాయి సింధు చిల్డ్రన్, ఉమెన్ హాస్పిటల్ తరఫున దాసరి స్వామి వాలీబాల్ యూత్ జట్టుకు జెర్సీలు స్పాన్సర్‌గా అందించారు.ఈ సందర్భంగా జట్టు సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.క్రీడలకు ప్రోత్సాహం అందిస్తూ యువతను ప్రోత్సహిస్తున్న దాసరి స్వామి సేవలు అభినందనీయమని వారు కొనియాడారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సహాయానికి మా వాలీబాల్ యూత్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలి

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- విద్యార్థులు గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.
- విద్యార్థినిలు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీమ్ ని సంప్రదించాలి.
- ఏ.ఎస్.పి, రిత్విక్ సాయి

**వేములవాడ, ఫిబ్రవరి 27( ప్రజాజ్యోతి) :**






రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలని వేములవాడ ఏ.ఎస్. పి రుత్విక్ సాయి విద్యార్థులకు పిలుపునిచ్చారు.. అరైవ్-అలైవ్,కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు అగ్రహారం వద్ద గల కె-కన్వెన్షన్ హాల్లో జెఎన్టియుహెచ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏ.ఎస్. పి, మాట్లాడుతూ...విద్యార్థి దశ నుండే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం వలన రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. జిల్లాలో ఎస్పీ గారి ఆదేశాల మేరకు అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా వాహనం నడిపే సమయాల్లో హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, తప్పని సరి అని, అతివేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపడం, ర్యాష్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని విద్యార్థులకు వివరించారు.

### సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అత్యవసరం..

ప్రస్తుతం సైబర్ నేరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత లింకులు క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారం ఎవరికీ పంచుకోవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద కాల్స్ లేదా మెసేజ్‌లు వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యానికి, కుటుంబానికి మరియు సమాజానికి హానికరమని వివరించారు. మత్తు పదార్థాల వ్యసనం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు.

### మహిళల రక్షణ కోసం జిల్లా షీ టీమ్ సేవలు..

మహిళల భద్రత కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీమ్ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళలు,విద్యార్థులు ఎలాంటి వేధింపులు గురైన నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని,నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని , ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని,గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు.మహిళల భద్రతకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ లు రామ్మోహన్, రాజు,షీ టీమ్ ఏ ఎస్.ఐ ప్రమీల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

---

# వార్డు ప్రజల రుణం తీర్చుకోలేనిది

## మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):**



వార్డు ప్రజల ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు జీవితాంతం మ-రువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక నాలుగవ వార్డులో కౌన్సిలర్‌గా ఘన విజయం సాధించిన సందర్భంగా వార్డు మహిళలు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఆయిల రమేష్, నాయకులు పేగడ పరశు రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ, దివంగత మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు తనయుడిగా ప్రజలు తనపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీతో గెలిపించడం గర్వకారణమన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికై, మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్ల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వార్డు ప్రజల రుణం తీర్చుకోలేనిదని, మున్సిపల్‌తో పాటు వార్డులో ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సహకారంతో నిధులు సమీకరించి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వార్డు మహిళలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల గౌరవం మా బాధ్యత

## జర్నలిస్టులకు ఇళ్లు స్థలాల మంజూరుకు కృషి

## చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి

**మంథని, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :**




సమాజంలో ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన పాత్రికేయ వృత్తికి అత్యున్నత గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డివిజన్ ప్రెస్ క్లబ్‌లో సీనియర్ పాత్రికేయులు సభ్యులుగా ఉండటం గర్వకారణమని, జర్నలిస్టుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జీతభత్యాలు లేకపోయినా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పాత్రికేయుల సేవలు అమూల్యమని కొనియాడారు. జర్నలిస్టుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషి చేస్తామని తెలిపారు. గతంలో తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేశారని చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా మంత్రి సహకారంతో అర్హులైన జర్నలిస్టులకు స్థలాలతో పాటు ఇండ్ల మంజూరుకు తమ వంతు పూర్తి కృషి చేస్తామని స్పష్టం చేశారు. మంథని ప్రజలకు అవినీతిరహిత, పారదర్శక పాలన అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ ఉండదని చైర్మన్, వైస్ చైర్మన్ స్పష్టం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేష్, మేడగోని రాజమౌళి గౌడ్, బూడిద తిరుపతి, బెజ్జంకి డిగంబర్, ఇరుగురాల ప్రసాద్ తో పాటు డివిజన్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొడారి మల్లేష్ యాదవ్, సహాయ కార్యదర్శులు మాదరబోయిన కిషన్, మాటేటి కుమార్, ప్రెస్ క్లబ్ మండల కన్వీనర్ మహావాది సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు బొల్లవరం విజయనంద రావు, కార్యవర్గ సభ్యులు వెల్మ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విజయానందరావు, పాత్రికేయులు రామడుగు సాయి శ్రీనివాస్, మాదేశి శ్రావణ్, ఏగోలపు సంతోష్ కుమార్ గౌడ్, అనుముల వీరస్వామి, మంథని లక్ష్మణ్, చీరాల రవీందర్, దహగామ సద్వాల్, ఆకుల రాజు, అమ్ము శ్రీనివాస్, చేలుకల యుగేందర్, ఆకుల వేణు, కాసర్ల శంకర్, కాసిపేట శ్రీకాంత్, ఆసంపల్లి స్వామి, రావుల రాజకుమార్, ఎండి సుభాన్ పాల్గొన్నారు.

# మార్చి 1న కరీంనగర్‌లో ఉద్యమ కారుల కృతజ్ఞతా సదస్సు




**మంథని, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :**

మార్చి 1న కరీంనగర్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమ కారుల కృతజ్ఞతా సదస్సును ఘనంగా విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి ఉద్యమ కారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్‌లో మంథని నియోజకవర్గం ఇంచార్జీ గోగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులకు బాసటగా నిలుస్తామని ప్రజా ప్రభుత్వం హామీ ఇవ్వడం హర్షణీయమని తెలిపారు. ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారునికి వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉద్యమకారులను గుర్తించి పెన్షన్‌తో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో తెలంగాణ ఉద్యమ కారుల కృతజ్ఞతా సదస్సును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సదస్సు కరీంనగర్‌లోని అమరవీరుల స్థూపం నుంచి ప్రెస్ భవన్ వరకు భారీ ర్యాలీతో కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మకంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, మంథని విజయ్ కుమార్, గుర్రం దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్, మంథని మండల అధ్యక్షుడు కాసిపేట సాంబయ్య, ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, ఉపాధ్యక్షుడు కొండల సమ్మయ్య, సీనియర్ ఉద్యమ నాయకులు రొడ్డ లింగయ్య, జమ్మిడి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద కుర్మపల్లిలో శుక్రవారం సభ

**చొప్పదండి , ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):**



చొప్పదండి మండలం ఆర్నకొండ సెక్టార్ పెద్ద కురుమ పల్లి గ్రామంలో ఐసిడిఎస్ సిడిపిఓ నర్సింగరాణి ఆధ్వర్యంలో మావురం సుగుణ అధ్యక్షతన శుక్రవారం సభ నిర్వహించారు. దీనిలో భాగం గా ఎత్తుకు తగ్గ బరువు, వయ-సుకు తగ్గ బరువు లేని పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని తల్లులకు వివరించారు. గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించారు. మహిళా సాధికారత గురించి డిహెచ్ఈ డబ్ల్యూ శైలజ తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సంతోషి, అంగన్వాడి టీచర్ సుజాత, స్కూల్ టీచర్ పద్మ, గర్భిణీ స్త్రీలు, తల్లులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డిఫెన్సివ్ డ్రైవింగ్‌ను అలవర్చుకోవాలి

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం
## జగిత్యాల ఎస్పి అశోక్ కుమార్

**కోరుట్ల, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

రోడ్డు ప్రమాదాల నివారణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని పోలీస్ శాఖ చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని డీసీఎం, కారు, అంబులెన్స్, ఆటో డ్రైవర్లకు స్థానిక వాసవి కల్యాణ మండపంలో ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్ పై అవగాహన సదస్సుతో పాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు








200 మంది డ్రైవర్లు పాల్గొని వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా “అరైవ్ అలైవ్ – ఏ క్యాంపెయిన్ ఫర్ సేఫర్ రోడ్స్ ఇన్ తెలంగాణ” అనే ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మొదటి ఫేజ్ ను విజయవంతంగా పూర్తి చేసుకొని రెండవ ఫేజ్ ను ఈ నెల 22 నుండి 28 వరకు జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని ప్రజల్లో అలవాటు చేయడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగా ఈరోజు వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని అన్నారు. రోడ్డు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నప్పటికీ, చూపు లోపం కూడా ఒక కారణమని అని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ, బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఎస్పీ హెచ్చరించారు. అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.

ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి, చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేశారు. అవసరమైతే తదుపరి చికిత్స కోసం సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేసే ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి డిఎస్పి అడ్డూరి రాములు, కోరుట్ల సీ.ఐ సురేష్ బాబు, మెట్ పెల్లి సిఐ అనిల్ కుమార్, కోరుట్ల ఎస్.ఐలు చిరంజీవి, రాంచంద్రం, మేడి పెల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి, కథలాపూర్ ఎస్సై రవి కిరణ్, కోరుట్ల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రేగొండ రాజేష్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ లు సంపత్ కుమార్, డాక్టర్ సుమన్, డాక్టర్ సమీర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి, కార్యదర్శి, పోలీస్ సిబ్బంది, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ సుమన్, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల జీవన్ రెడ్డి, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నీల నాగరాజు ఎన్నిక

**వీణవంక, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**




వీణవంక మండల కేంద్రానికి చెందిన నీల నాగరాజును తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నీల నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాల్లో వారం రోజుల్లో కమిటీలను ఏర్పాటు చేసి సంస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు అయ్యే వరకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌కు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులందరికీ నీల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, వారి హక్కుల సాధనలో ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ నియామకంతో వీణవంక మండలానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని స్థానిక నాయకులు, ఉద్యమకారులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**వేములవాడ, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.



## హెచ్‌పివి టీకాతో బాలికలకు రక్షణ

**వేములవాడ, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**




భారతదేశ భవిష్యత్తును నిర్మించే మన ఆడబిడ్డల ఆరోగ్యం విషయంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సర్వికల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) ముప్పు నుంచి బాలికలను రక్షించేందుకు ఉచిత ఎచ్. పి. వి.టీకా పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తేదీ: ఈ నెల 28న ప్రారంభం. వేదిక: దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు. అర్హత: 14 నుంచి 15 ఏళ్ల లోపు బాలికలు. లక్ష్యం: తెలంగాణలో 3.30 లక్షల మందికి టీకా పంపిణీ. రాబోయే తరాలను ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడుతుంది. ఆరోగ్య భారత్ దిశగా వేస్తున్న ఈ అడుగు ఎంతోమంది ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసానిస్తుంది. తల్లిదండ్రులకు విజ్ఞప్తి: మీ ఇంట్లో 14–15 ఏళ్ల బాలికలు ఉంటే, సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ఈ ఉచిత టీకాను ఇప్పించండి. సర్వికల్ క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం.

## వైభవంగా గృహ ప్రవేశం ఆశీర్వదించిన దుద్దిళ్ల శ్రీనుబాబు

**మంథని, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :**

మంథని మండలంలోని అడవి సోమనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సేగ్గం రాజేశ్ సబిత దంపతుల కుమార్తె మంథని ధరణి విద్యాసాగర్ నూతన గృహ ప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ముఖ్య అతిథిగా హాజరై, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన గృహం ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం, సుఖసంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులందరికీ శుభఫలితాలు కలగాలని కోరుకున్నారు. మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్నతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.



# రచ్చపల్లి రత్నాలు పుస్తకావిష్కరణ

**ధర్మారం, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల స్వీయ రచనతో వెలువరించిన రచ్చపల్లి రత్నాలు బాలల కవితా సంపుటి పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. షేక్ శుక్రవారం రోజున రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీయ రచనతో వేసే పుస్తకాలు వారిలో సృజనాత్మకతను పెంపొందించడానికి,భాష పట్ల ఆసక్తి కలిగించడానికి ఉపయోగపడుతాయని అన్నారు.ఈ సందర్భంగా ఏ.ఎం.ఓ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు.పిల్లల ఊహాశక్తి అపారమైనదని వారు ఏ విషయాన్నైనా ఆసక్తితో నేర్చుకుంటారని అందుకే వారికి చిన్న వయసులోనే పాఠశాల పట్ల,చదువు పట్ల ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని



అన్నారు.ప్రాథమిక పాఠశాల పిల్లలు అయినప్పటికీ చక్కని భావంతో అందమైన కవితలు రాశారని వారిని ఈ విధంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు అభినందనీయులని అన్నారు.రచ్చపల్లి రత్నాలు పుస్తకంలో 20 మంది విద్యార్థుల కవితలు ఉన్నాయి. వారి కవితలను పుస్తక రూపంలో ప్రచురించి విద్యార్థులను ప్రోత్సాహిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సముద్రాల వంశీ మోహనాచార్యులను ప్రత్యేకంగా అభినందించారు. రచ్చపల్లి రత్నాలు పుస్తకాన్ని తెలుగు ఉపాధ్యాయుడు, బాలసాహితీవేత్త కందుకూరి భాస్కర్ పరిచయం చేశారు. మండల విద్యాధికారి పోతు ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు శ్రీనివాస రావు, గ్రామ సర్పంచ్ సూర రజిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్ పర్సన్ ప్రమీల, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల వంశీ మోహనా చార్యులు, వాఖ్యత నూతి మల్లయ్య ఉపాధ్యా యులు లక్ష్మణ్, సంపత్,సతీష్, లక్ష్మి, కవిత, గ్రామ పంచాయితీ సెక్రెటరీ ప్రకాష్,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ నే కానీ మీ సేవకున్ని

## స్వయంగా మంచినీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్

**మెట్‌పల్లి, ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):**
పట్టణంలో ప్రజాసేవకు కొత్త అర్థం చెబుతున్నారు ఒకటో వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్. ఈ రోజుల్లో రాజకీయ నాయకుల హంగు, ఆర్బాటం ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. ఎన్నికల్లో గెలిచిన వెంటనే అధికారపు గర్వంతో ప్రజలకు దూరమయ్యే నాయకులు ఉన్న ఈ కాలంలో "కౌన్సిలర్ నే కానీ మీ సేవకున్ని" అనే నినాదంతో ప్రజల మధ్యే ఉండి సేవ చేస్తున్న నాయకుడిగా నవీన్ కుమార్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఒకటో వార్డులో మంచినీటి సమస్య తలెత్తే అవకాశం ఉండటంతో ముందస్తుగా చర్యలు చేపట్టారు. వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాను ప్రారంభించారు. అంతేకాదు, స్వయంగా ట్యాంకర్ వద్ద నిలబడి



ఇంటింటికి వెళ్లి నీటిని అందజేయడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. మున్సిపల్ వైస్ చైర్మన్ హోదాలో ఉన్న వ్యక్తి స్వయంగా నీటి సరఫరా పర్యవేక్షించడం మాత్రమే కాకుండా, ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ఇలాంటి నాయకులు ఉంటేనే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది" అని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓంకారి నవీన్ కుమార్ మాట్లాడుతూ, "నన్ను నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజలకు సేవ చేయడం నా బాధ్యత. ఒకటో వార్డు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటాను. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అధికార హోదా కంటే సేవాభావానికే ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న ఓంకారి నవీన్ కుమార్‌కు పట్టణ ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయాల్లో సేవా స్ఫూర్తి ఇంకా సజీవంగానే ఉందని ఆయన మరోసారి నిరూపించారు.

## ఐఎన్‌టిఎస్‌ఓ జాతీయ స్థాయి ఫలితాల్లో

### శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**
స్థానిక బోయవాడలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నేషనల్ వైడ్ నిర్వహించిన ఐఎన్‌టిఎస్‌ఓ పరీక్షల్లో విశిష్ట ఫలితాలు సాధించారు. మొత్తం 180 మంది విద్యార్థులు ఎంపికై విజయదుందుభి మోగించారు. ఎంపికైన విద్యార్థులందరికీ నగదు బహుమతులు, గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికేట్లు అందజేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ న్యాలకొండ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం ఏం రాజు మాట్లాడుతూ, శ్రీ చైతన్య విద్యార్థులను అన్ని కోణాల్లో తీర్చిదిద్దుతూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందని పేర్కొన్నారు. కోఆర్డినేటర్ ప్రవీణ్ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ విజయ్ కృష్ణ, కోఆర్డినేటర్ భార్గవి, ప్రైమరీ ఇన్‌చార్జ్ శ్వేత, ఒలంపియాడ్ ఇన్‌చార్జ్ స్వప్న అనూషతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బేకరి అండ్ స్వీట్ హౌస్ ప్రారంభం



**మంథని, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :**
మంథని పట్టణంలో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీ విబి బెంగుళూరు అయ్యంగార్ బేకరి అండ్ స్వీట్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యజమాని చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, వ్యాపార రంగంలో మంథని మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపార వేత్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

## మాదిగ హక్కుల దండోరా 6వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జమ్మికుంట, ఫిబ్రవరి27( ప్రజాజ్యోతి ):**
జమ్మికుంట పట్టణం ఆబాదిలో మాదిగ హక్కుల దండోరా 6వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి దొడ్డే రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి ఉద్యమ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల సామాజిక హక్కుల సాధన కోసం దండోరా ఉద్యమం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనలో పోరాటం కీలకమైందన్నారు. రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ముత్యంపేట లో నలభై లక్షల అభివృద్ధి పనుల శంకుస్థాపన



**ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**
మల్లాపూర్ మండలంలో ముత్యంపేట గ్రామంలో మహిళా సంఘ భవనాలకు 30 లక్షల రూపాయలు మరియు గ్రామ ప్రజలకు నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు ఇప్పించి ఈరోజు ప్రియతమ నాయకులు నరసింగ రావు గారు చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ తెలు నరేష్ జిల్లా కిషన్ సేల్ అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి గారు మల్లాపూర్ ఎంపీడీవో శ్రీకాంత్ గారు ఏపీఎన్గారు సీసీలు ఎక్స్ ఎంపీపీ నల్ల రాజన్న గారు ఉప సర్పంచ్ వంగ పోతన్న కాంగ్రెస్ నాయకులు వాకిటి భూమారెడ్డి బోల్లం రఘు నేటి వెంకటరెడ్డి పుంద్ర శ్రీనివాస్ రెడ్డి మరిపెల్లి మల్లయ్య కోటగిరి ఆనంద్ గౌడ్ పాల్గొన్నారు.

## మహాలక్ష్మి వారికీ ఓడిబియ్యం

**వేములవాడ, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**
శుక్రవారం ఏకాదశి సందర్భంగా వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పట్టణానికి చెందిన బుక్క కుల మహిళలు సుమారు 70 మంది లోక కళ్యాణార్థం అందరూ సంతోషంగా జీవించాలని మహాలక్ష్మి అమ్మవారికి పసుపు, కుంకుమ, ఫలహారాలు, పండ్లు, చీరే, సారే, ఒడిబియ్యం సమర్పించడం జరిగింది. ముందుగా బుక్క కుల మహిళలు వేములవాడ మొదటి బైపాస్ రోడ్డు నుండి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు కోలాటాలతో నగర సంకీర్తన చేసిన పిదప అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరే, సారే, ఒడిబియ్యం సమర్పించడం జరిగింది. తదనంతరం మహిళలు అమ్మవారి అష్టోత్తర నామాలను 108 సార్లు జపించిన తర్వాత బుక్క కుల మహిళలు ఒకరికి ఒకరు పసుపు బొట్టు చెల్లించి, నూతన వస్త్రాలను వాయినంగా ఇచ్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి బుక్క కుల మహిళలు వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ తదితర పట్టణాలకు చెందిన దేవరకొండ అరుణకుమారి, బండి శైలజ, బండి వనిత, దేవరకొండ విద్య, కామారపు అనంతలక్ష్మి, కామారపు చంద్రిక, కామారపు సత్యలక్ష్మి, చింతల భాగ్యలక్ష్మి, చింతల విజయ, చింతల స్వరూప, దేవరకొండ జయశ్రీ, కామారపు వాణి, కామారపు మౌనిక, కామారపు శైలజ, దేవరకొండ వాసు తదితర 70 మంది బుక్క కులస్తులు పాల్గొనడం జరిగింది.



# తెలంగాణ ఉద్యమకారుల సమావేశం విజయవంతం చేయాలి

### అమరవీరుల స్థూపం నుంచి ర్యాలీ

### ఫిలిం భవన్‌లో కీలక చర్చలు



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నగర అధ్యక్షుడు గోడిశాల రమేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఒక ప్రముఖ హోటల్‌లో ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారులకు, తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం కార్యాచరణ రూపొందించాలని కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఒక కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతార్హమని పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్‌లో జరిగే సమావేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి ర్యాలీ ప్రారంభమై ఫిలిం భవన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు రామరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి దయ్యాల ఓం ప్రసాద్, నగర అధ్యక్షుడు గోడిశాల రమేశ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఊకంటి ఓంకార్, కేంసారం సమ్మయ్య, నగర ఉపాధ్యక్షుడు గోడిశాల సతీష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి మంద వెంకన్న, నగర సహాయక కార్యదర్శి పల్లె నారాయణ గౌడ్, వట్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వం కోసం పోరాడిన నేత జగ్జీవన్ రామ్



ఎండపల్లి, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి): సామాజిక సమానత్వం కోసం పోరాడిన నేత బాబు జగ్జీవన్ రామ్ అని విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు అన్నారు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోటలో అంబేద్కర్ యువజన సంఘం ఎదురుగా, కోడిపుంజులపల్లె వెళ్లే మార్గంలో వంతెన సమీపంలో ఏర్పాటు చేయబోయే బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి శుక్రవారం రోజున విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్ అరిగేల జయవ్వ రవి,వార్డ్ సభ్యులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,కుల సంఘాల నాయకులు,బాబు జగ్జీవన్ రామ్ అభిమానులు గ్రామస్తుల మధ్య బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేయడం జరిగింది,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,భారతదేశానికి బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చాలా గొప్పవని అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం పోరాడారని వారి హక్కుల కోసం ఆయన జీవితాంతం సాగించిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని దేశ స్వాతంత్రం కోసం సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత జగ్జీవన్ రామ్ అని దళితుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ కమిటీ అధ్యక్షులు జంగిలి హనుమండ్లు,గ్రామ పంచాయతీ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్,బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఒరగంటి నగేష్ ,తెలంగాణ మాదిగ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు చుంచు మల్లేశం, ఉమ్మడి వెల్గటూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఉప సర్పంచ్ అరిగేల జయవ్వ రవి,వార్డు సభ్యులు,బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ కమిటీ సభ్యులు,తాజా మాజీ ప్రజా ప్రతినిధులు ప్రముఖులు,వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## నారాయణపూర్ నిర్వాసితులకు

# అండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర , ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి): గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ ను పూర్తి చేసి, భూ నిర్వాసితులకు పరిహారం అందజేయ డంలో తనకున్న చిత్తశుద్ధిని మరోసారి చాటుకున్నారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. నారాయణపూర్ రిజర్వాయర్ భూ సేకరణ చేసి, నిర్వాసితులకు పరిహారం అందజేయడానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా నారాయణ పూర్ భూ నిర్వాసితులకు పరిహారం అందజే యడానికి ఇప్పటికే ప్రభుత్వం నుండి రూ. 23.50 కోట్లను మంజూరీ చేయించారు. శుక్రవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని మరోసారి హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నారాయణపూర్ రిజర్వాయర్ పరిహారం కోసం మరో రూ. 20 కోట్లు మంజూరు చేయాలని కోరారు. పరిహారం మంజూరుకు మొత్తం కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం, పాలకులు నారాయణపూర్ ముంపు బాధితులను పట్టించుకోలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నిర్వాసితులకు పరిహారం చెల్లించడానికి రూ. 23.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మరో రూ. 20 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులను పూర్తిస్థాయి లో ఆదుకొని వారికి న్యాయం చేస్తామని తెలిపారు. కాగా పరిహారం మంజూరుకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రికి ఎమ్మెల్యే సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

# పశువుల నీటి తొట్టి పునర్నిర్మాణంపై ఉద్రిక్తత



ముస్తాబాద్, ఫిబ్రవరి 27 ( ప్రజా జ్యోతి ): చిప్పలపల్లి గ్రామంలో పశువుల నీటి తొట్టి పునర్నిర్మాణం అంశంపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ సర్పంచ్ మాశెట్టి లక్ష్మణ్ వివరాల ప్రకారం, గతంలో గ్రామంలోని ఒక ప్రాంతంలో ఉన్న పశువుల నీటి తొట్టిని కొంత మంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి ధ్వంసం చేసి తమ సొంత అవసరాలకు వినియో గించుకున్నట్లు ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ ప్రజల మధ్య విస్తృత చర్చ జరిగింది. గ్రామసభ తీర్మానం మేరకు పాత స్థలంలోనే పశువుల నీటి తొట్టిని తిరిగి నిర్మించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. తీర్మానం ప్రకారం శుక్రవారం పునర్నిర్మాణ పనులను ప్రారంభించగా, ఆక్ర మణదారుడు అక్కడికి చేరుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తో సమాచారం అందుకున్న పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకుని ఇరు పక్షాలతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామసభ తీర్మానాన్ని అమలు చేయడం తమ బాధ్యత అని, గ్రామ అభివృద్ధి పనులకు ఎవరూ ఆటంకం కలిగించ వద్దని కోరారు. గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను అడ్డుకున్నా, గొడవలకు దిగినా చట్టరీత్యా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. గ్రామంలో శాంతిభద్రతలు కాపాడాలని సూచిస్తూ ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు.

# స్మశాన వాటికలో సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ధర్నా



పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి): గ్రామ స్మశాన వాటిక భూమిలో సోలార్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు, సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో రాఘవాపూర్ గ్రామంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ గ్రామంలో గత 20 సంవత్సరాలుగా అన్ని కులాల ప్రజలు ఒకే స్మశాన వాటికను వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సోలార్ ప్రాజెక్టు పేరుతో అక్కడ ఉన్న సమాధులను తొలగిస్తూ నిర్మాణ పనులు చేపట్టడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. గ్రామ పరిధిలో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ స్మశానానికి సంబంధించిన భూమినే ఎంపిక చేయడం సరైన చర్య కాదని విమర్శించారు. ఇతర ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. స్మశాన వాటికలోనే ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తే గ్రామ ప్రజలతో కలిసి నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. వెంటనే సోలార్ ప్రాజెక్టును రద్దు చేసి ప్రత్యామ్నాయ స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుమ్మరి నవీన్, జిల్లాల ప్రశాంత్, కునుకుల సతీష్, కుమార్, సారయ్య కుమార్, మహేష్, ప్రవీణ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కునారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బీ) అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి.

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి): కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి కూనారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి కూనారం ఆర్.ఓ.బి బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత శాఖకు బదలాయించామని, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని అన్నారు. అండర్ పాస్ పనులు నెల రోజుల లోపు పూర్తి చేయాలని, ఆర్.ఓ.బి పూర్తయ్యే లోపు అప్రోచ్ రోడ్డును కూడా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకుని రావాలని రైల్వే శాఖ అధికారులను, ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్ &బీ భావ్ సింగ్,పెద్ద పల్లి ఆర్డీఓ బి.గంగయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జనావాసాల మధ్య ఎయిర్టెల్ టవర్ వద్దు

## పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన అల్మాస్ పురం మహిళల మండలి





ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్పూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యులు మహిళలు యువకులు శుక్రవారం రోజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జనావాసాలలో ఎయిర్టెల్ టవర్ నిర్మించడం ద్వారా రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యంతో గురవుతున్నామని ఇంకా ప్రమాదం వ్యాధులు క్యాన్సర్ బారిన పడుతున్నారని జరుగుతుందని భయంతో మహిళా సంఘ సభ్యులు సీఐ శ్రీనివాస్ గౌడ్ ఎస్సై రాహుల్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఎయిర్టెల్ టవర్ అనుమతులు జిల్లా కేంద్రం నుంచి అనుమతి తీసుకున్నారు మా చేతిలో ఏమీ లేదని చేతులు లేపిన పోలీసులు జిల్లా కలెక్టర్కు విన్నవించాలని వారు వివరించారు.

# అరైవ్‌అలైవ్ ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం

## కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం





**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్‌అలైవ్ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరం శుక్రవారంతో విజయవంతం ముగిసిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 448 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారని పేర్కొన్నారు,నగరంలోని ప్రముఖ కంటి ఆసుపత్రులు పాల్గొని సమగ్ర పరీక్షలు నిర్వహించాయని పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు,కంటి చుక్కల మందులు,ఉచిత సర్జరీ కార్డులు కూడా అందజేశామని తెలిపారు,డ్రైవర్లకు కంటి చూపు సక్రమంగా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది,లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బదిరుల పాఠశాలలో ముందస్తు సైన్స్ డే వేడుకలు



**కరీంనగర్ టౌన్ , ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**



ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్ డే ని పురస్కరించుకొని ముందస్తు గా నగరంలోని భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బధిరుల పాఠశాలలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు శివ జ్యోతి మాట్లాడుతూ పిల్లలు వినికిడి మరియు మాటలు లోపం తో వివరణ చేయలేరు కనుక పిల్లల్లో ఉన్న మేధాశక్తిని ముగ్గుల ద్వారా సైన్స్ పటాలు వాళ్లలో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు వచ్చే దిశగా ప్రతి సంవత్సర లాగానే ఈ సంవత్సరం కూడా బదిరుల పాఠశాలలో సైన్స్ డే వేడుకలు నిర్వహించి పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశామని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన గర్రెపల్లి రాణిని అభినందించారు.ఈ కార్యక్రమంలో బదిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసీరామ్ , మరియు ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

# పసికందు మృతి ఘటనపై నిందితులను శిక్షించాలి

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుల దురహంకారంతో రజక కుటుంబానికి చెందిన రెండేళ్ల చిన్నారి మృతి చెందడం అత్యంత హేయమైన ఘటనగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) పెద్దపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఘటనలో బాధ్యులైన నిందితులపై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ, కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడం వల్లే చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు బాధితురాలు వెల్లడించినప్పటికీ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ సమాజంలో ఇంకా కుల వివక్షతో ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. టీపీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ, జాతర సందర్భంగా వంద రూపాయల టికెట్ కొనలేమని చెప్పిన కారణంతో స్థానిక ప్రజాప్రతినిధి సహా కొందరు అగ్రవర్ణ వ్యక్తులు బీసీ కుటుంబంపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ దాడిలో మహిళపై దౌర్జన్యం జరగడంతో పాటు రెండేళ్ల చిన్నారిని కాలితో తొక్కడం వల్ల మృతి చెందడం అమానుషమన్నారు.ఇంతటి ఘటన జరిగినప్పటికీ పోలీసులు బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి చిన్నారి తల్లిదండ్రులపైనే కేసులు నమోదు చేయడం, ప్రధాన నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం పక్షపాత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని న్యాయ విచారణ జరపాలని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం (ఎక్స్‌గ్రేషియా) చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని టీపీఎఫ్ నాయకులు కోరారు. ఈ ప్రకటనపై టీపీఎఫ్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులు కే.రాజు, బి.సుధాకర్, కే.అంజన్న మద్దతు తెలిపారు

# నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంచాలి

## మండల వ్యవసాయ అధికారి యోగిత



**కథలాపూర్, ఫిబ్రవరి 27(ప్రజాజ్యోతి):**

రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని మండల వ్యవసాయ అధికారి యోగిత సూచించారు. ఈ నేపథ్యంలో ఏఓ యోగిత మండలంలోని గంభీర్పూర్ గ్రామంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, లైసెన్సులు, ధరల జాబితాలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రుద్ర ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందులకు సంబంధించిన పీసీలు, స్టాక్ రిజిస్టర్ వివరాలు, బిల్లులు సరిగా లేకపోవడంతో పదిహేను రోజులకు స్టాప్ సేల్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ధరలకు మించి విక్రయాలు జరపవద్దని, రైతులకు సరైన బిల్లులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. గడువు ముగిసిన ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# పూర్తిస్థాయి బాధ్యత తీసుకున్న జిల్లా కలెక్టర్ను శుభాకాంక్షలు తెలిపిన టిఎన్జీవోఎస్



**సిరిసిల్ల టౌన్ , ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ పూర్తిస్థాయి బాధ్యత తీసుకున్న సందర్భంగా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసిన టిఎన్జీవోఎస్ జిల్లా కార్యవర్గం అధికారులు. ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ ఎలుసాని ప్రవీణ్ కుమార్, కార్యదర్శి శ్రీ గాజుల సుదర్శనం, సహాధ్యక్షులు శ్రీ మెట్ట శ్రీకాంత్, కోశాధికారి శ్రీ మొహమ్మద్ రియాజ్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ మొహమ్మద్ అజీజ్, ఏఈఓ ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ఏ ఎస్ ఓ, జిల్లా అధ్యక్షులు సుమన్ పాల్గొన్నారు.

# సీనియర్ వైద్యుడు అనూప్ రావు బీజేపీలో చేరిక

## క్రియాశీల సభ్యత్వం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**కోరుట్ల, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**



కోరుట్ల పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ వైద్యుడు డా. వై.అనూప్ రావు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ నుండి అధికారికంగా భారతీయ జనతా పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబుల ఆద్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సమక్షంలో పార్టీ కండువా కప్పి, ఆయనకు క్రియాశీల సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి పాల్గొన్నారు. కోరుట్ల నియోజకవర్గం నుంచి సుమారు 350 మంది కార్యకర్తలు, నాయకులు 70-80 కార్లలో కోరుట్ల లోని అనూప్ రావు హాస్పిటల్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లి ఈ చేరిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నూతనంగా గెలిచిన కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డా. అనూప్ రావు మాట్లాడుతూ.. దేశాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా బీజేపీలో చేరినట్లు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీతో కలిసి కృషి చేస్తానని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుంచి తాను ప్రత్యక్షంగా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

# ఎఫ్‌పిఓకి రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక అవార్డు



## అభినందించిన కె.వికే శాస్త్రవేత్తలు

**జమ్మికుంట, ఫిబ్రవరి 27 ( ప్రజాజ్యోతి ):**

జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జమ్మికుంట రైతు ప్రగతి ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (ఎఫ్ పి ఓ )కు 2025 సంవత్సరానికి గాను నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ భారత ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్ర స్థాయి-ంలో మొదటి స్థానం "కోఆపరేటివ్ ఎక్సలెన్స్ & మెరిట్-2025" అవార్డు లభించింది.. ఈ అవార్డును హైదరాబాద్‌లోని సహకార బ్యాంకుల అగ్రశ్రేణి (అపెక్స్) బ్యాంక్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్ చేతుల మీదుగా ఎఫ్ పి ఓ ప్రెసిడెంట్ ఎస్. మహేందర్, డైరెక్టర్లు, సీఈఓ స్వీకరించారు. 2021 నవంబరులో ప్రారంభమైన ఈ ఎఫ్ పి ఓ ప్రస్తుతం 750 మంది రైతులతో ఇన్‌పుట్, ఔట్‌పుట్ వ్యాపారాలను నిర్వహిస్తోంది. కేవీకే ప్రధాన కార్యదర్శి పి. విజయ్ గోపాల్ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్ రావు అభినందించారు.



# ప్రశాంత వాతావరణంలో కలిసి గడపడం ఆనందదాయకం

## డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** ప్రశాంత వాతావరణంలో ఒకరికి ఒకరు తోడుగా కలిసి సీనియర్ సిటీజన్లు ముచ్చటించు కోవడం చాలా సంతోషకరమని కరీంనగర్ నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరంలోని 42వ డివిజన్ భగత్ నగర్ దే కేర్ సెంటర్‌లో ప్రణామ్ సీనియర్ సిటీజన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్, క్యారమ్, చెస్ ఇండోర్ క్రీడల బహుమతుల ప్రదాన కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు తన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉన్నత ఉద్యోగాలు చేసి పదవీ విర మణ అనంతరం సీనియర్ సిటీజన్లుగా దే కేర్ సెంట ర్‌లో కలిసి గడపడం ఆదర్శవంతమని అన్నారు. ఒకరికి ఒకరు సుఖదుఃఖాలను పంచుకోవడం, సాధకబాధకాలను చర్చించుకోవడం సమాజానికి మంచి సందేశమని పేర్కొన్నారు.సీనియర్ సిటీజన్లు ఇలాగే ఐక్యంగా ఉండాలని సూచిస్తూ, ఇలాంటి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతోనే దే కేర్ సెంటర్‌ను ప్రారంభించి అవసరమైన సౌకర్యాలు కల్పించామని తెలిపారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తాయని, ఆరోగ్యంగా జీవిం చేందుకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఇండోర్ క్రీడలను నిర్వహిస్తూ మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలని సీనియర్ సిటీజన్లకు సూచించారు. సీనియర్ సిటీజన్ గౌరవ అధ్యక్షుడు ఉచ్చిడి మోహన్ రెడ్డి, ఇన్‌చార్జి అధ్యక్షుడు మోసం అంజయ్య, ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ఖజాంచి చింతల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఉప్పల రమేష్ పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక రామగుండం నియోజకవర్గ కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా అయిత శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా డా.దుర్గం నగేష్







**ఎన్ టి పి సి,, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** రామగుండం నియోజకవర్గంలోని స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పనిచేసే స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని 202627 సంవత్సరానికి గాను శుక్రవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐక్యవేదిక అధ్యక్షుడిగా అయి-ంత శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ దుర్గం నగేష్ రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచుతూ సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధ్యతలు అప్పగించిన సభ్యులకు, ముఖ్యంగా పరికిపండ్ల నరహరికి కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షులు మంచికట్ల దయాకర్; ముఖ్య సలహాదారు పల్లెర్ల రమేష్; వర్కింగ్ అధ్యక్షుడు మద్దెల దినేష్; ఉపాధ్యక్షులు గోలివాడ చంద్రకళ, ఇందారపు సునీత, జక్కని శ్రీలత; కోశాధికారి పైడి సాయికుమార్; సంయుక్త కార్యదర్శులు కత్తెరమల్ల రాజలింగం, కంది సుజాత, మందల రమాదేవి; ప్రచార కార్యదర్శులు బిల్లా శ్రీదేవి, గాదం సరిత లక్ష్మి, కంకటి రవి గౌడ్; సోషల్ మీడియా ఇన్‌చార్జ్ చీమల నందన్. సమావేశంలో గౌరవ సభ్యులు కొండ రమాదేవి, కంపెల సుశీల, ఇమ్మిడి శారద, గుర్రం మమత, సిహెచ్ భాగ్యలక్ష్మి, లంక సురేష్ పాల్గొన్నారు. నూతన కమిటీ సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ప్రతినిధులు సంకల్పం వ్యక్తం చేశారు.

# ఎల్వోసినీ మంజూరు చేపించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన మారుపాక దేవరాములు కు అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 2 లక్షల 50 వేల రూపాయలు, ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేపించారు.. కాగ ఎల్‌ఓసి మంజూరు చేపించడం పట్ల బాధిత కుటుంబ సభ్యుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# సీపీ గౌస్ ఆలంను కలిసిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా



**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చిత్ర మిశ్రా శు క్రవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించారు,ఈ సందర్భంగా నూతన కలెక్టర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ మొక్కను అందజేశారు.జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా యంత్రాంగం,పోలీస్ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసుకునే దిశగా చర్చించుకున్నారు.ఈ సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రస్తుత పరిస్థితులు,ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్,పోలీస్ కమిషనర్‌లు క్లుప్తంగా చర్చించారు.జిల్లా అభివృద్ధి,ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రెవెన్యూ,పోలీస్ శాఖలు పరస్పర సహకారంతో సమన్వయంగా పనిచేయాలని నిర్ణయించారు.

# ఘనంగా విప్లవ వీరుడు ఆజాద్ చంద్రశేఖర్ జయంతి



**రాయికల్, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** రాయికల్ మండలం రామాజీపేట్ గ్రామంలో భారత స్వాతంత్ర్య సమ-రయోధుడు ఆజాద్ చంద్ర శేఖర్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు, యువకులు కలిసి ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమరంలో ఆజాద్ చంద్రశేఖర్ చేసిన త్యాగాలు, పోరాటాలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడి యువతకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. ఆయన దేశభక్తి, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా యువత దేశభక్తి భావంతో ముందుకు సాగాలని, దేశ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న వారందరూ ఆజాద్ చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇద్దం సు-ధీర్ రెడ్డి మాజీ ఉప సర్పంచ్ హరీష్ రావు వార్డు నెంబర్ భరత్ రెడ్డి ఎనుగంటి రాములు గుజ్జుల కిరణ్ రెడ్డి కోల రాజు అంబల్ల సత్యం బోయిని నరేందర్ వీరవేణి మహేష్ కంటె నవీన్ గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ‘అరైవ్-అలైవ్’తో డ్రైవర్లకు కంటి పరీక్షలు



**మంథని, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :** రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రాణాలు కాపాడుకోగలమని మంథని సీఐ రాజు స్పష్టం చేశారు. మంథని పట్టణంలో శుక్రవారం నిర్వహిం చిన ‘అరైవ్-అలైవ్’ రోడ్డు భద్రతా కార్యక్రమం2026 లో భాగంగా డ్రైవర్లకు అవగాహనతో పాటు కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. మంథని సర్కిల్ పరిధిలోని మంథని, రామగిరి, ముత్తారం పోలీస్ స్టేషన్ల పరిధిలో పనిచేసే డ్రైవర్లకు నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 120 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. చూపు లోపం ఉన్న డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేసి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రాజు మాట్లాడుతూ.. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, ముత్తారం ఎస్ఐ రవికుమార్, మంథని ఎస్ఐ2 సాగర్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి డ్రైవర్ ప్రతి ప్రయాణికుడు రోడ్డు భద్రతను పాటిస్తేనే సురక్షిత సమాజం సాధ్యం!

# మోడల్ స్కూల సందర్శన



**కాల్వ శ్రీరాంపూర్ , ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని .మల్యాల గ్రామ సమీపంలో గల. మోడల్ స్కూల్. జూనియర్ కళాశాలను ఎంపీడీవో కలికోట రామ్మోహన చారి. శుక్రవారం రోజున సందర్శించారు. వంటలను పరిశీలించారు. గదులను పరిశీలించారు. విద్యార్థుల శుభ్రంపై పరిశీలించారు. ఈయన వెంట. ప్రిన్సిపాల్ అనుముల పోచయ్య. ఎంపీడీవో సిబ్బంది. ఉపాధ్యాయ బృందం. ఉన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యమే తన లక్ష్యం

**కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి కేంద్ర నిధులే ఊపిరి**

**సిఎస్ఆర్‌తో ఆధునిక పరికరాల ప్రారంభం**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**





**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే తన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందని పేర్కొన్నారు. ఎన్టీపీసీ సిఎస్ఆర్ నిధులతో లాప్రోస్కోపీ, ఈసీజీ, సిటిజి మిషన్లు సహా పలు ఆధునిక పరికరాలు అందించామని తెలిపారు. ఇంకా అవసరమైన పరికరాలను కూడా త్వరలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.జిల్లా ఆస్పత్రి నిర్వహణకు ప్రతి ఏడాది సగటున రూ.50 నుంచి 70 కోట్ల వరకు ఎన్‌హెచ్‌ఎం నిధులు అందుతున్నాయని చెప్పారు. ఇది పేదలపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.కరోనా మహమ్మారి సమయంలో పీపీఈ కిట్ ధరించి ఆస్పత్రిని సందర్శించానని, ఫ్రంట్‌లైన్ వారియర్ల సేవలు తనను కదిలించాయని గుర్తుచేశారు. ఆ సమయంలో గ్లౌజులు, మాస్కులు లేని పరిస్థితుల్లో సిబ్బంది ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తించి, ఎంపీ నిధుల నుంచి తక్షణ సాయాన్ని అందించామని తెలిపారు.గతంలో అవసరమైన పరికరాల కొరత వల్ల పేద రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై అలాంటి పరిస్థితి రాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కరీంనగర్ జిల్లా ఆస్పత్రిని ఉత్తర తెలంగాణలో ఆదర్శవంతమైన హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.కేంద్ర నిధులు, సిఎస్ఆర్ సహకారంతో ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.



# డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాల నివారణ సాధ్యం

**డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించిన రామగుండం పోలీస్ కమిషనరేట్**





**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):**

ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకుంటే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్‌అలైవ్' రెండో విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో ఆటో, వ్యాన్, టాక్సీ, లారీ డ్రైవర్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు శిబిరాలను నిర్వహించి డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. డ్రైవర్ల కంటి చూపు సక్రమంగా ఉండటం ప్రమాదాల నివారణలో కీలకమని పేర్కొన్నారు. వయస్సు పెరుగుదలతో పాటు కలర్ బ్లైండ్ వంటి సమస్యలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశముందని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో అవసరమైన డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందజేయడంతో పాటు చికిత్స సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది డ్రైవర్లు ప్రయోజనం పొందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదని సూచించారు. వాహన పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవడంతో పాటు వాహనాల సాంకేతిక పరిస్థితిని తరచుగా పరిశీలించాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని పోలీసులు పేర్కొన్నారు.



# కవితపై పెట్టిన కేసు రాజకీయ కుట్రలో భాగమే

**తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్**

**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు నిర్వహించారు. జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత పై నమోదైన కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఈ వేడుకలు చేపట్టారు.ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, కవితపై పెట్టిన కేసు రాజకీయ కుట్రలో భాగమని ఆరోపించారు. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కేసును కొట్టివేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసు పేరుతో నమోదు చేసిన వ్యవహారంలో స్కాం లేదని కోర్టు స్పష్టం చేయడం న్యాయానికి విజయమని అన్నారు.ఈ కేసులో కవితతో పాటు అర్వింద్ కేజ్రీవాల్, మనిష్ సిసోడియా తదితరులకు కూడా ఉపశమనం లభించిందని తెలిపారు. నిజం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుందని, ధర్మం గెలుస్తుందనే విషయానికి ఈ తీర్పు నిదర్శనమని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రతీకార ధోరణితో తప్పుడు కేసులు నమోదు చేసిందని ఆరోపిస్తూ, ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన సమాధానం ఇస్తారని హరిప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు రమేష్, సీనియర్ నాయకులు వారల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, పిన్నింటి సంగీత రెడ్డి, యండి సల్మా, పూదరి రజేశ్వరి గౌడ్, కుర్ర పోచాయ్య, గాలిపల్లి రాత్కర్ చారి, యండి హుసైన్ జంగ అపర్ణ, బండ అశోక్, సంతోష్ యాదవ్, కుర్ర కౌసిక్, బసవేణి రాజేందర్, కొత్తూరి రఘు, గుండెటి తిరుపతి, పుసాల పవన్, ఎం.డి.రజీ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ వృత్తిని అవమానించే విద్యా కమీషన్ రిపోర్ట్ వెంటనే రద్దు చేయాలి

## పీఆర్టీయూటీఎస్ స్టేట్ కన్వీనర్ కర్రు సురేష్

**మంథని, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :**



ఉపాధ్యాయ వృత్తిని కించపరిచేలా, అవగాహన రాహిత్యంతో రూపొందించిన విద్యా కమీషన్ రిపోర్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని పీఆర్టీయూటీఎస్ స్టేట్ కన్వీనర్ కర్రు సురేష్ అన్నారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఈ నివేదిక ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉందని మండిపడ్డారు. ప్రభుత్వానికి సమర్పించిన ఈ విద్యా కమీషన్ రిపోర్ట్‌లో ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఆర్థిక దృక్కోణంతో మాత్రమే చూడటం దురదృష్టకరమని అన్నారు. నైతిక విలువలను పెంపొందిస్తూ, మానవ వనరులను తీర్చిదిద్దుతూ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయ వృత్తిని కార్పొరేట్ ఉద్యోగాలతో పోల్చడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. జీతాలు ఎక్కువగా ఉన్నాయంటూ వ్యాఖ్యానించడం, ప్రమోషన్లు అవసరం లేదని సూచించడం, క్షేత్ర స్థాయిలో అమలుకు అసాధ్యమైన నియామక విధానాలను ప్రతిపాదించడం ద్వారా కమీషన్‌కు ఉపాధ్యాయ వ్యవస్థపై ఎంతటి అవగాహన లోపం ఉందో స్పష్టమవుతోందన్నారు. నిర్మాణాత్మక ఆలోచనలతో కాకుండా విమర్శనాత్మక ధోరణితో, కమీషన్ పరిధికి సంబంధం లేని అంశాలను ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో, ఉపాధ్యాయ వృత్తిని అవమానించే ఈ విద్యా కమీషన్ రిపోర్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం క్షేత్ర స్థాయిలో అనుభవం గల సీనియర్ ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, మేధావుల నుంచి సూచనలు సేకరించి సమగ్ర నివేదిక రూపొందించాలని కర్రు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయుల వేతనాలపై విద్యా కమిషన్ వ్యాఖ్యలు తగవు

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):**

రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వం కు సమర్పించిన "తెలంగాణ రాష్ట్ర విద్యా విధానం 2026" నివేదికలో ఉపాధ్యాయుల వేతనాలు మార్కెట్ ప్రమాణాలతో పోలిస్తే అధికంగా ఉన్నాయని పేర్కొనడం వాస్తవాలకు విరుద్ధమని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్రం (పీఆర్టీయూటీఎస్) పెద్దపల్లి జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తూ భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దుతున్నారని సంఘం నాయకులు తెలిపారు. అలాంటి బాధ్యతాయుత సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుల జీతాలను అధికంగా పేర్కొనడం వారి కృషిని తక్కువ చేసి చూపించే చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ధరల పెరుగుదల, ఇంధన వ్యయం, గృహ వసతి ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల జీవన వ్యయానికి అనుగుణంగా వేతన సవరణలు జరగడం సహజ పరిపాలనా విధానమని తెలిపారు. ఉపాధ్యాయులకు అందించే వేతనం ఖర్చు కాదని, దేశ భవిష్యత్తుపై పెట్టుబడిగా గుర్తించాలని సూచించారు.

### పదోన్నతుల విధానంపై అభ్యంతరం

ఉపాధ్యాయులకు పదోన్నతులు సేవా ప్రాధాన్యత (సీనియారిటీ) ఆధారంగా కాకుండా ప్రమాణాల ఆధారంగా ఇవ్వాలన్న ప్రతిపాదన అవగాహన లేమికి నిదర్శనమని సంఘం పేర్కొంది. ఇప్పటికే దాదాపు 20 సంవత్సరాల సేవ అనంతరం మాత్రమే పదోన్నతులు లభిస్తున్న పరిస్థితుల్లో ఈ విధానం సేవా నియమాలకు వ్యతిరేకమని వెల్లడించింది.

### ప్రధానోపాధ్యాయుల నియామకాలపై వ్యతిరేకత



ప్రధానోపాధ్యాయుల పదవుల్లో 50 శాతం ప్రత్యక్ష నియామకాల ప్రతిపాదనను పీఆర్‌టీయూటీఎస్ వ్యతిరేకించింది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు పదోన్నతి ద్వారా మాత్రమే ఈ పోస్టులను భర్తీ చేసే ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ అర్హతలు జాతీయ మండలి పరిధిలోనే ఉపాధ్యాయుల అర్హతలను నిర్ణయించే అధికారం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలికే ఉందని, ఇప్పటికే అమల్లో ఉన్న అర్హత ప్రమాణాల ప్రకారమే భవిష్యత్ నియామకాలు కొనసాగించాలని సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు పీఆర్‌టీయూటీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో ప్రభుత్వం ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

# సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ నిదర్శనం

## లయన్స్ క్లబ్‌లో 'లయన్ బొమ్మ వెంకటేశ్వర్' బ్లాక్ ప్రారంభం మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**



కరీంనగర్ లయన్స్ క్లబ్‌లో 'లయన్ బొమ్మ వెంకటేశ్వర్' పేరుతో నిర్మించిన నూతన బ్లాక్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మ వెంకన్న పేరుతో బ్లాక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. సామాజిక సేవకు లయన్స్ క్లబ్ నిదర్శనమని అన్నారు. రేకుర్తి ప్రాంతంలో దూరదృష్టితో ఏర్పాటు చేసిన ఐ హాస్పిటల్ ద్వారా లక్షలాది మంది పేదలకు వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. 1988 సంవత్సరం నుంచి లయన్స్ క్లబ్ నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇప్పటివరకు 8 లక్షల 52 వేల మందికి ఓపీ సేవలు అందించగా, 1,21,000 మందికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించారని వివరించారు. అదనంగా 95 వేల మంది బీపీఎల్‌కు పైబడిన వారికి కూడా శస్త్రచికిత్సలు చేసినట్లు వెల్లడించారు. 9,000 గ్రామాల్లో వైద్య



శిబిరాలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు 2010లో అన్యాక్రాంతమైన స్థలాన్ని అధికారులతో మాట్లాడి సుమారు నాలుగున్నర ఎకరాలను స్మశాన వాటిక కోసం కేటాయింపునకు సహకరించానని గుర్తుచేశారు. లయన్స్ క్లబ్ లేకపోతే ఆ ప్రాంత అభివృద్ధి సాధ్యపడేదే కాదని వ్యాఖ్యానించారు. సామాజిక కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ ఒక వేదికగా నిలుస్తోందని, విద్యా మరియు వైద్య రంగాల్లో విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సామాజిక సేవల పట్ల యువతలో ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బొమ్మ వెంకన్న సోదరునిగా వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సేవాభావంతో పనిచేస్తున్న కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం కప్‌లో రాణించిన విద్యార్థి జయసాయి చరణ్‌కు కలెక్టర్ సన్మానం

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):**



సీఎం కప్2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విజేత క్రీడాకారులను సన్మానించారు. గోదావరిఖని పట్టణంలోని అడ్డగుంటపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న టింగు జయ సాయి చరణ్ హైదరాబాద్‌లోనిలో నిర్వహించిన



రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జయసాయి చరణ్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దపల్లి జిల్లా నుంచి పాల్గొన్న 22 మంది విద్యార్థులు మొత్తం 4 బంగారు, 8 వెండి, 10 కంచు పతకాలు సాధించడం గర్వకారణ మన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, పీఈటీ ప్రెసిడెంట్ సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభారాణి, ఆర్చరీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, కోచ్‌లు పసునూటి చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# డీలర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

## రూ.5వేలు గౌరవవేతనం చెల్లించాలి.. పదేళ్ళ బకాయిలు ఖాతాల్లో జమచేయాలి.. డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):**



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేషన్ డీలర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం శుక్రవారం సిరి ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర కమీషను పేరుతో కాలాయాపన చేయకుండా ఒకే కమీషన్ చెల్లించాలని, గతేడాది నుండి రేషనుషాపుల్లో మగ్గుతున్న దొడ్డుబియ్యాని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రూ.5వేల గౌరవవేతనం చెల్లించాలన్నారు. రేషనుషాపులను మిని సూపర్ మార్కెట్లుగా గుర్తించి తక్కువ ధరకే నిత్యవసర సరుకులు అందుబాటులోకి తేవాలని, డీలర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, వేబ్రిడ్జీల ఏర్పాటు, కరోనాతో మరణించిన డీలర్ల కుటుంబనికి రూ.20లక్షలు పరిహారం చెల్లించాలని, అద్దె, కరెంటుబిల్లు, ఇతర ఖర్చులను ప్రభుత్వమే భరించాలని సూచించారు. ఎప్పటి కమీషన్ అప్పుడే జమచేయాలని, హైద్రాబాదులో రేషన్ భవన్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలని, అర్హతను బట్టి డీలర్లకు పదోన్నతులు కల్పించాలని రమేష్ బాబు కోరారు. అంతకుముందు నూతన జిల్లా అధ్యక్షుడిగా మద్దెల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా దొంకెన తిరుపతిగౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డిమల్ల హన్మాండ్లు, ఊక శేఖరరావు, చంద్రశేఖర్, పులిమామిడి లక్ష్మినారాయణ, కిరణ్ కుమార్ రెడ్డి, చిలగాని మోహన్, పోతరాజు రమేష్, భానుచందర్ రావు, వెంకన్న, భాస్కర్ రెడ్డి, సందీప్, నాగభూషణం పాల్గొన్నారు.